శక్తి, అపాయింట్‌మెంటు ఆర్డరు జారీ చేసేందుకు వీల్లేకుండా అతణ్ణి గట్టిగా బిగించి పట్టుకుంది. పగ, పాము పడగలా - పాపాలనీడలా - ప్రాణసారాన్ని పీల్చే విషవాయువులా అతడి ఆలోచనా శక్తిని మెత్తగా నొక్కివేస్తూంది. మరి కాసేపటికి, మనసునీ, మెదడునీ ఊపి పారేస్తూన్న మానసిక ఘర్షణకు తట్టుకోలేక, ఏభై యేండ్ల వార్ధక్యపు వసారాలో కాలుపెట్టిన జగన్నాథం, పళ్లు గిట్టి కరుచుకొని, కుర్చీ వెనక్కి జేరబడ్డాడు

నాగరాజు తనకు స్వయాన మేనల్లుడు. వాస్తవానికి వాడి ముఖం తనకు స్పష్టంగా జ్ఞాపకం రావడంలేదు. ఎందువల్లనంటే, వాణ్ణి చూసి, ఇరవై యేండ్లపైబడుతుంది. వృద్ధిలోకి రావలసిన ఆ కుర్రాడిపైన తనకేమాత్రమూ కోపం లేదు. కాని, ఒకరోజు నాన్ననూ, అమ్మనూ నిష్కారణంగా నడిరోడ్డుమీద నిలుచునేటట్టుచేసిన ఆదిశేషయ్యను తలుచుకుంటే ఆవేశం ఆకాశాన్ని మించిపోతూంది. కేవలం అధికలాంఛనాలకు ఆశపడి తమ కుటుంబాన్ని ఎంత క్రూరంగా హింసించాడీ ఆదిశేషయ్య! మొదట్లో కొత్తసైకిలన్నాడు. వెనువెంటనే కొత్త రేడియో అన్నాడు. ఈ రెంటిలో దేన్ని త్వరగా ఇచ్చుకోగలమా అని ఆలోచించే వ్యవధి కూడా ఇవ్వకుండా చెల్లిని ఇంటికి పంపేశాడు. అంతటితో ఊరుకోక, ఊరంతా చిలవలు పలవలుగా కల్పించి చెపుతూ వచ్చిన అతడి తల్లిగారి చూపుడువ్రేలికి తలఊపి, నాన్నగారికి ఎనలేని మనస్తాపాన్ని, మనఃక్లేశాన్ని కలుగజేశాడు. చెల్లి జీవితానికి ఏర్పడ్డ దుస్థితికి అమ్మ అనుభవిస్తూన్న ఆత్మక్షోభను చూడలేక, ఉన్న ఒక్కగానొక్క కొంపనూ ఆదరా బాదరాగా వచ్చినధరకు అమ్మేసి, అల్లుడి కోరికను నెరవేర్చి, తగినరీతిలో అతణ్ణి అనునయపరిచి, చెల్లిని అత్తవారింటికి పంపించారు నాన్న. ప్రత్యామ్నాయంగా తాము బాడుగింట్లో తలదాచుకోవలసి వచ్చింది. ఇంతా జరిగి చెల్లి మాత్రం ఏం సుఖపడిందని. దేనికైనా పెట్టిపుట్టాలంటారు. మొదటి ప్రసవానికే ఆరోగ్యం పూర్తిగా చెడి, మగపిల్లవాడిని కన్న నాలుగునెల్ల లోపల, ససేమిరా ఇక తెరవనంటూ కళ్ళుమూసింది. ఆదిశేషయ్య మాత్రం గడ్డిపోచంత పశ్చాత్తాపాన్ని కనబరచకుండా, కనీసం మర్యాదకోసమైనా ఓ కబురు పెట్టకుండా, భార్య గతించిన ఏడాదికి పునర్వివాహం చేసుకున్నాడు.

తనవల్ల, తను పుట్టిపెరిగిన కుటుంబానికి ఏర్పడ్డదుస్థితికి కుమిలిపోయి, అత్తవారింటి నిరాదరణకు చితికిపోయి, మానసికంగా — శారీరకంగా కృంగి కృశించిపోయి, చివరకు దీనంగా బ్రతుకు చాలించినచెల్లిగురించి, అతడి మగపిల్లాడి తల్లి గురించి ఆలోచించేపాటి తీరిక ఆ మహానుభావుడికి లేకపోయింది.

"అల్లుడికింకా మనమీదకోపమెందుకే పార్వతీః" అమాయకంగా, వేదనాభరితంగా అమ్మ వేపుచూస్తూ అన్న, నాన్నగారి ముడతలుపడ్డ ముఖం తన హృదయంలో చెరగని ముద్ర వేసింది.

ఆలోచనలనుండి తేరుకున్న జగన్నాథం, అప్రయత్నంగా పిడికిళ్ళు బిగించాడు విపరీతంగా, క్రోదోద్రేకంతో ఆలోచించడంవల్ల మెదడు వేడెక్కి ముఖం స్వేదసిక్తమయింది. కణతల దగ్గరి సన్నటి నరాలు కొట్టుకోనారంభించాయి. కుర్చీలోంచి లేచివెళ్ళి, కిటికీ రెక్కల్ని విప్పాడు. వడగాలి ముఖాన విసురుగా కొట్టింది. ఓ నిమిషంపాటు అతడు కిటికీదగ్గర నిశ్శబ్దంగా నిలుచున్నాడు. అనంతమైన ఎడారిలో అతి నిర్జీవంగా తాండవమాడే ప్రశాంతత అతడిచుట్టూ బద్ధకంగా ఒళ్లువిరుచుకుంది చుక్కల్లేని ఆకాశం ఎండకారవేసే నల్లటి చీరలా పైన వ్రేలాడుతూంది. భూమ్యాకాశాలు కాటుక ముద్దగా మారినట్లు, కనుచూపుమేర చీకటి చిందులేస్తూంది. దూరాన రాత్రి షిఫ్టు ప్రారంభిస్తూ ఏదో ఫాక్టరీ సైరన్, పనివాళ్ళను పరుగెత్తుకు రమ్మని ఆదేపనిగా అరుస్తూంది. అంతలో ఎర్రటి ఒంటి కంటిని నిప్పురవ్వలా వెలిగించే రాక్షసిలా, జెట్ విమానం ఒకటి అథోలోకాలనూ, ఆకాశ గోపురాలనూ అల్లల్లాడిస్తూ దూసుకుపోతూంది. జగన్నాధం అప్రయత్నంగా రెండు చెవుల్నీ చేతులతో మూసుకొని, మళ్ళీ కుర్చీలోకి వచ్చి కూర్చున్నాడు. ఇప్పుడతని మనసు — సంపూర్ణంగా ఆహారం ఆరగించి, కదల్లేకుండా పడి ఉన్న కొండచిలువలా నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉంది. అంతవరకూ అతడిలో దోబూచులాడిన తటవటాయింపులు, అంతరాత్మ అదమాయింపులూ మటుమాయమయాయి. నిదానంగా, నిస్సంకోచంగా రెడ్ ఇంక్ పేనాను చేతిలోకి తీసుకున్నాడు. నాగరాజు విషయమై రిక్రూటింగ్ ఆఫీసరు పంపించిన పేపరుమీద రెండోచూపు చూడకుండా అడ్డంగా రెండు పొడవైన గీతల్ని గీశాడు. ఈసారి తెల్లపేపరు తనను వెక్కిరిస్తున్నట్టు ఎటువంటి మచ్చా పడకుండా ఉండటంచూసి కాస్తంత తెల్లబోయి చూశాడు జగన్నాథం. పేనాను దులిపి మరోసారి కసిగా గీశాడు. లాభం లేకపోయింది. పేనాలో ఎరుపుసిరా అయిపోయిందని తెలుసుకొని అతడు విసుగ్గా ముఖం చిట్లించి సిరాబుడ్డిని వెదకనారంభించాడు. అంతలో ధనలక్ష్మి మెల్లగా తలుపుతీసుకొని ప్రవేశించింది. ఆమె వయసు నలభయ్యేవ పడిలోపడినా చూసినవారు అలాగని తకీమని చెప్పలేరు. సౌమ్యత ఉట్టిపడే వదనంతో, ప్రసన్నత ప్రతిఫలించే నేత్రాలతో, ఎప్పుడూ తెలికాంతుల్ని చిందించే చిరుహాసంచేస్తూ కనిపిస్తుంది. కాలపుగుర్తులు



ఆమెలో చోటుచేసుకున్నా — ఆమె నిండారోగ్యం, అంగసౌష్ఠవం ఒకనాటి ఆమె విశిష్టసౌందర్యానికి, సుందరరూపానికీ, సాక్షీభూతాలగా నిలిచాయి. ఇంటా బయటా కూడా భారీ అంతస్తునీ, హోరుమనిపించే భర్తహోదానూ ద్విగుణీకృతం చేయాలన్న తాపత్రయం ఆమెలో ఏ కోశానా కనిపించదు.

"మిమ్మల్ని చూడాలని ఒకాయన కాసుక్కూర్చున్నారు డార్లింగ్ !" ముగ్గురుబిడ్డల తల్లి స్థానాన్ని స్వీకరించిన తరవాత కూడా, ఆమెలో చలాకీతనం, సెలయేటి గలగలల హుందాతనం కొంచెంకూడా తగ్గినట్లు కనిపించదు. భార్యనుచూసి, అంతవరకూ సాగించిన అన్వేషణ ఆపి, చిన్నగా నవ్వాడు జగన్నాథం.

"ఇంత రాత్రిపూటా!"

"అర్జంటుగా చూడాలని తొందర పడుతున్నారు. మీరాయనకు బంధువులట" జగన్నాథం మాట్లాడకుండా వేనాను బల్లమీదుంచి, "పద" అన్నాడు.

"కొంచెం ఉండండి." అని భర్త షర్టు కాలర్‌ను ఓమారు సర్ది, "ఇప్పుడు వెళ్ళండి!" అంది. జగన్నాథం ఈసారి గట్టిగా నవ్వకుండా ఉండలేకపోయాడు.

మేడమెట్లు దిగుతూన్న జగన్నాథాన్ని చూసి, పీక్కుపోయిన దవడలతో తోడుగా గాజుపెంకుల్లా కనిపిస్తూన్న కళ్ళతో ఒకాయన చటుక్కున లేచి నిలుచున్నాడు. మరికొంచెందగ్గరికొచ్చినతరవాత, ఆవచ్చిన వ్యక్తి ఎవరోజగన్నాథం పోల్చుకోగలిగాడు. నిటారుగా నడుస్తూ, ఆ వ్యక్తిని సమీపించి, కళ్లపొడిచేటంత సూటిగా, తీక్షంగాచూస్తూ, "ఏం కావాలి?" అని అడిగాడు. జగన్నాథం చూపుల్లోని వాడిని తట్టుకోలేక, ఆది శేషయ్య ఓ క్షణం బిత్తరపోయినట్లు చూశాడు. వెంటనే తమాయించుకొని, "నాగరాజు విషయం మాట్లాడదామని వచ్చాను జగన్నాథం" అని శక్తినంతా కూడదీసుకొని అనగలిగాడు.


"ఏ నాగరాజు?"

"మీ చెల్లెలి కొడుకు." జగన్నాథానికి ఈసారి ఆవేశం వరద ముంపులా ముంచుకొచ్చింది. క్రోధోద్రేకంతో అతడి శరీరం కాస్తంత వణికింది.

"మర్యాదగా చెపుతున్నాను. బయటకు నడు." భర్త కోపానికి కారణం తెలుసుకున్న ధనలక్ష్మి, గబగబా అడుగులువేస్తూ భర్తకు సమీపంగా వచ్చి నిలుచుంది. తనను చూసి భర్త తప్పకుండా ఆవేశం తగ్గించుకుంటాడని ఆమె నమ్మకం.

"నాకు లభించే సత్కారం గురించి నాకు ముందే తెలుసు జగన్నాథం! మీ చెల్లికి చాలా అన్యాయం జరిగింది. అందుకు నేనే కాదు—మా అమ్మకూడా కొంతవరకు బాధ్యురాలు. మీ చెల్లి పోయిన కొన్ని నెల్లకు మీ అమ్మ మంచమెక్కి, బొమికల గూడయి ప్రాణాలు వదిలిందని విన్నాను. మా ధనదాహం ఇంత ఘోరానికి కారణమవడం చాలా సిగ్గుచేటు. ఇది చెప్పడం, నీ నమ్మకాన్ని పొందాలని కాదు. నన్ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తావని. నీకు వరసగా ముగ్గురు మగబిడ్డలు. నాగరాజు పిన్నికి వరుసగా నలుగురు ఆడకూతుళ్ళు. ఆరోగ్యరీత్యా నేను ఉద్యోగవిరమణచేసి, ఇప్పటికి ఏడాది దాటిపోయింది.

"ఇక నేను చచ్చినా, బ్రతికినా ఒక్కటే! కాని నాగరాజు విషయంఅలా కాదు. పుట్టినప్పటి నుంచీ జీవితంలో వసంతం చూసి ఎరుగడు. ఇప్పటికే ఉద్యోగం దొరక్క చాలా క్రుంగిపోయాడు. చెప్పవస్తే, గవర్నమెంటు ఉద్యోగానికి అవసరమైన ఏజ్ లిమిట్‌ని వాడెప్పుడో దాటేశాడు. వాడిని నమ్ముకున్న చెల్లెళ్లూ, వాడిని కన్నతల్లిలా




సాకుతూవచ్చిన పిన్నీ గాలిలో విడిచి పెట్టిన దీపాల్లా బిక్కుబిక్కుమని బ్రతుకుతున్నారు. నాగరాజు విషయమై ఓ ముఖ్యమైన సంగతి చెపుతున్నాను. నాగరాజుకి ఉద్యోగం దొరకడం కష్టం. ఎందుకంటే, చిన్నప్పుడు కాలిలో ఏదో గుచ్చుకొని, పాదం సెప్టిక్ అయిపోవడం వల్ల, చివరకు చేసేదిలేక కుడిపాదం తీసి వేశారు. నా ముఖంచూసి వాడికి సహాయం చేయనక్కరలేదు, ఎందుకంటే, నేను దేనికీ అర్హుణ్ణికాను. కాని మీ చెల్లి కొడుకు ముఖంచూడు. ఆ తరవాత నీ యిష్టం!" రెండు చేతుల్నీ జోడించి, బదులుకోసం ఎదురుచూడకుండానే ఆది శేషయ్య కదిలి వెళ్ళిపోయాడు. జగన్నాథం నిశ్శబ్దంగా వెళ్ళి, సోఫాలో కూర్చుని, రెండుకళ్ళూ మూసుకున్నాడు భర్త కళ్ళనుండి కన్నీరు కారడంచూసి, ధనలక్ష్మి భర్త తలను ప్రేమగా నిమురుతూ,

"పెద్దవారు పసిపాపల్లా ఏడ్వకూడదు," అని అంది.

"నేను ఏడ్వటంలేదు. మా చెల్లి కొడుకు గురించి ఆలోచిస్తున్నాను."

ఆకాశంలోని ఓ పెద్ద మబ్బు, శీతల పవనం సోకి వర్షించనారంభించింది.